క్లుప్తంగా

ఉపాధిహామీ పనులు ప్రారంభం



రాజన్నపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో సోమవారం ఉపాధిహామీ పనులను ఎంపీడీవో చిరంజీవి, సర్పంచ్ ముక్క శంకర్ ప్రారంభించారు. కాంటూరు కందకాల పనులకు పెద్ద ఎత్తున తరలివచ్చిన కూలీలనుద్దేశించి వారు మాట్లాడారు. వేసవిలో కూలీలకు ప్రభుత్వం అదనపు బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డులున్న వారికి వంద రోజులు పని కల్పిస్తామన్నారు. అలాగే వారి వేతనాలను నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కూలీలకు తాగునీటి వసతి, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి



శిబిరం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. స్థానిక పంచాయితీరాజ్ అతిథి గృహంలో సోమవారం 19వ వార్డు ప్రజలకు కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వారం రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు పాల్గొని కంటిజబ్బులపై ఉచిత చికిత్స పొందాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు గడ్డం చందన, అన్నారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

కోనరావుపేట: మండలం సుద్దాలలో నూతన గ్రామపంచాయతీ భవనానికి సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాశవేణి మమత, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, మాజీ వైస్‌ఎంపీపీ కచ్చకాయల ఎల్లయ్య, ఉప్పుల శంకర్, ఎరవెల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం

- మూడేళ్లుగా ఇదే పరిస్థితి
- ఆగం చేస్తున్న అకాల వర్షం
- కాగితాలకు పరిమితమవుతున్న పరిహారం నివేదికలు
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట: మూడేళ్లుగా యాసంగి సీజన్‌లో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించే పరిహారం అందని ద్రాక్షగానే మారింది. ఈ సంవత్సరం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొస్తుందని ఆశించిన అన్నదాత ఆశలకు వడగండ్ల వర్షాలు గండికొట్టాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పంటలను పరిశీలించి పరిహారం అందిస్తామని భరోసా ఇస్తున్నా, గత అనుభవం హామీలను నమ్మలేని స్థితిలో రైతులు ఉన్నారు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురవుతున్నారు.

మూడేళ్లుగా అకాల వర్షాలు యాసంగి సీజన్‌లో అన్నదాతను వెంటాడుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలో ఈ యాసంగిలో వడగళ్ల వాన రైతులకు పెద్ద ఎత్తున నష్టాన్ని కలిగించింది. 24 గ్రామాల్లో 15,750 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. సుమారు పది గ్రామాల్లో అకాల వర్షాలు పంటను దెబ్బతీశాయి. ఇలాగే 2021, 2022లో కూడా అకాల వర్షాలు రైతులను నట్టేటా ముంచాయి. అప్పటి అధికారులు పంట పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికలు పంపినా ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం చేతికందలేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులకు పరిహారం అందిస్తామని ఇస్తున్న హామీలు, నివేదికలు కాగితాలకే పరిమితమవుతున్నాయి.



వడగండ్ల వానతో నేలవాలిన వరి పంట

ఆత్మహత్యలే శరణ్యమా.?

గతంలో పంట నష్టపోయిన ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లికి చెందిన సుంకరి పుష్పలత అనే మహిళా రైతు అప్పులు తీర్చలేని పరిస్థితిలో మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. తన కున్న మూడెకరాల్లో పంట సాగు చేయగా, వడగళ్ల వానతో ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో నష్టం జరిగింది. దీంతో గడ్డి మందు తాగిన పుష్పలత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఇలా పంటలు నష్టపోయిన రైతులు పరిహారం అందకుంటే పుష్పలత లాగా తమకు కూడా ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది గ్రామాల్లో అపార నష్టం

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మండలంలోని పది గ్రామాల రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఎల్లారెడ్డిపేట మండలం రాజర్లబొప్పాపూర్, బండలింగంపల్లి, కోరుట్లపేట, సింగారం, నారాయణపూర్, వెంకటాపూర్, పదిర, ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో రైతులకు వరి పంట నేల వాలడంతో పంట చేతికి రాకుండా పోయింది. వడగండ్ల వర్షాలతో పొట్ట దశలో ఉన్న పంట నేలపాలైంది. నష్టం వాటిల్లిన గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పర్యటించి రైతులకు మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ రైతులకు మాత్రం భరోసా కలగడం లేదు. మూడేళ్లుగా పరిహారం కోసం రైతులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి.

33శాతం మించి నష్టం జరిగితేనే పరిహారం

ప్రతి ఏడాది యాసంగిలో అకాల వర్షాలు రైతులను ఆగం చేస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నప్పటికీ పరిహారం మాత్రం అందలేదు. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తున్నా, ఏ ఒక్క రైతుకు కూడా ఇప్పటి వరకు పరిహారం అందిన దాఖలాలు లేవు. నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) ప్రభుత్వ నిబంధనల ప్రకారం అకాల వర్షాలతో 33 శాతంకు పైగా పంటలు దెబ్బతింటేనే పరిహారం వస్తుంది. అంతకు తక్కువగా ఒక్క శాతం నష్టం జరిగినా పరిహారం చెల్లించే పరిస్థితి లేదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. నిబంధనలతో రైతులకు అందే పరిహారం అందకుండా పోతోంది. పంటల సాగు కోసం చేసిన అప్పులతో పాటు పంట చేతికి రాక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమై రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయాధికారులను అప్రమత్తం చేసి నష్టపోయిన పంటలకు వంద శాతం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.

రైతులను ఆదుకోవాలి



అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి. అప్పు చేసి పంటలు సాగు చేసిన రైతులకు పంటలు చేతికొచ్చే సమయానికి ఇలా జరుగుతోంది. మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించాలి.

– మోతే మధుసూదన్‌రెడ్డి, రైతు, నారాయణపూర్

వంద శాతం పరిహారం అందించాలి



యాసంగిలో వడగండ్ల వానతో రైతులు నష్టపోయిన పంటలకు వంద శాతం పరిహారం అందించాలి. అధికారులు నామమాత్రంగా పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తున్నారు. అలా కాకుండా రైతులకు జరిగిన నష్టాన్ని వారి సమక్షంలోనే నివేదికలను తయారు చేసి కలెక్టర్‌కు అప్పగించాలి.

– నిమ్మ నారాయణరెడ్డి, బీకేఎస్, జిల్లా గౌరవాధ్యక్షుడు

నివేదికలు అందజేశాం



అకాల వర్షాలతో పంట నష్టపోయిన గ్రామాల్లో పర్యటించి రైతులతో కలిసి పంటలను పరిశీలించాం. నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాం. 33 శాతానికి పైగా నష్టపోయిన పంటలకే పరిహారం అందుతుంది. నివేదికల ఆధారంగా తప్పకుండా పరిహారం వస్తుంది.

– చాద భూంరెడ్డి, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట



బోయినపల్లి: విలాసాగర్‌లో విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో..



తంగళ్లపల్లిలో..

దొడ్డి కొమురయ్యకు నివాళి

తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలోని 17వ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథిరెడ్డి, తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పడిగెల మానస, ఎంపీడీవో పి.లచ్చాలు, ఏపీవో నాగరాజు కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎగుర్ల కరుణాకర్, ఎల్లారెడ్డిపేటలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. బోయినపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చందుర్తి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వర్తి లక్ష్మీనారాయణ దొడ్డి కొమురయ్య చరిత్ర వివరించారు.

– సిరిసిల్లఅర్బన్/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/చందుర్తి

వడగండ్ల బాధిత రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముస్తాబాద్: వడగండ్ల బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి తహసీల్దార్‌కు సోమవారం జనహితలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ మాట్లాడుతూ వడగండ్ల వాన కురిసి నెలరోజులైనా ఇప్పటి వరకు అధికారులు సర్వే చేయకపోవడం అన్యాయమన్నారు. రైతులంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపు ఉందన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకోవడమే తప్ప, రైతులకు ఏం చేసింది లేదని విమర్శించారు. ఇప్పటికైనా సర్వే చేపట్టి, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి సుంచు మల్లయ్య, రైతులు గొట్టె బాబు, పాటి నర్సయ్య, జంగ రాజనర్సయ్య, పర్శరాములు, శాగ రాజయ్య పాల్గొన్నారు.

జనహితకు రెండు దరఖాస్తులు

వీర్నపల్లి: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహిత కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎమ్మార్వో తఫజుల్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ సురేంద్రబాబు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని బీసీ స్టడీసర్కిల్‌లో నిర్వహించిన కానిస్టేబుల్, ఎస్ఐ మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. శిక్షణ పొందిన అభ్యర్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పిడియాట్రిషియన్ డాక్టర్ సురేంద్రబాబు హాజరయ్యారు. కష్టపడి చదివి ఉద్యోగాల సాధనతో జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, కోర్సు కోఆర్డినేటర్ మెన్నెని హరీశ్‌రావు, సురేశ్, దివ్య, కిరణ్మయి, రాజేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుబాక్స్‌లో ఉత్తరం వేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట/రుద్రంగి: : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన చర్యలకు నిరసనగా ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీపై కక్ష కట్టి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని, సూరత్ కోర్టులో ఇచ్చిన తీర్పును తప్పుపడుతూ పోస్టుకార్డు ఉద్యమం ద్వారా ప్రధానమంత్రి మోదీకి పోస్టుకార్డులు పంపారు. డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చెన్ని బాబు, రాములు, శ్రీనివాస్, రమేశ్, నరేశ్, గణేశ్, మహిపాల్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ



షార్ట్ ఫిల్మ్‌లో నటిస్తున్న నటీనటులు, సాంకేతిక బృందం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణ బృందం సందడి చేసింది. సోమవారం తంగళ్లపల్లిలో 'హే మచ్చా' అనే యూట్యూబ్ ఛానెల్ ఆధ్వర్యంలో 'ఆదివారం చుట్టాలు ఇంటికి వస్తే' అనే షార్ట్ ఫిల్మ్‌ను చిత్రీకరించారు. శుక్రవారం రోజున షార్ట్‌ఫిల్మ్‌ను యూట్యూబ్‌లో విడుదల చేస్తామని డైరెక్టర్ మహిధర్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు మౌనిక యాదవ్, అశోక్, నగేశ్, మహేశ్, మనోజ్, రాజన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



వేములవాడఅర్బన్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



బోయినపల్లి: గది నెంబర్ చూసుకుంటున్న విద్యార్థినులు



రుద్రంగి: తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్స్

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేందుకు ఆయా కేంద్రాల వద్దకు గంట ముందే చేరుకున్నారు. ఒకరిద్దరు తప్ప పరీక్షకు విద్యార్థులందరూ హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఈవో రమేశ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసి ఉంచారు.

వేములవాడఅర్బన్: వేములవాడ, వేములవాడ అర్బన్, రూరల్ మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,144 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు కాగా 1,142 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాధికారి బన్నాజీ తెలిపారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీజీహెచ్ఎస్‌లో 280 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 227 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

రుద్రంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 209 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వంద శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

కోనరావుపేట: మండలంలో మూడు సెంటర్లలో 415కు 415 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరయ్యారు. ఆయా సెంటర్లలో తాగునీటి, వైద్య సదుపాయాలు కల్పించినా ధర్మారం పరీక్షా గది చీకటిగా ఉండడంతో విద్యార్థులు కంచెం ఇబ్బందికి గురయ్యారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో రెండు, గాలిపల్లిలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. 417 మంది విద్యార్థులకు గాను వంద శాతం హాజరయ్యారు. ఇల్లంతకుంటలో రెండు పరీక్షా కేంద్రాలను డీఈవో రమేశ్ పరిశీలించారు.

వీర్నపల్లి: స్థానిక జెడ్పీహెచ్ఎస్ కేంద్రంలో 193 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 192 మంది విద్యార్థులు హాజరయ్యారు. అల్మాస్‌పూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థిని పరీక్ష రాయలేకపోయింది. పరీక్ష కేంద్రాన్ని మండల తహసీల్దార్ తాఫాజుల్ హుస్సేన్, ఎంపీడీవో నరేశ్‌కుమార్ తనిఖీ చేశారు.

బోయినపల్లి: బోయినపల్లి కేంద్రంలో 209, విలాసాగర్ కేంద్రంలో 65 మంది విద్యార్థులు హాజరయినట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి తనిఖీ చేశారు.



ముస్తాబాద్‌లో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



కోనరావుపేట: ధర్మారంలో చీకటిగా ఉన్న గదిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అలరించిన నాటక ప్రదర్శన



కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో శ్రీవేణుగోపాలస్వామి కళామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిడుతల రామాయణం నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కళామండలి సభ్యులు వాలి–సుగ్రీవుల యుద్ధం, రామ–రావణ యుద్ధం, శ్రీసీతారాముల పట్టాభిషేకం తదితర ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, ఎంపీటీసీ లక్ష్మి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, కళామండలి చైర్మన్ భూంరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో శ్రీమల్లికార్జునస్వామి, కేతమ్మ, మేడాలమ్మ కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మల్లికార్జునస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, ఎల్లం యాదవ్, పర్శరాములుగౌడ్, పెంజర్ల నారాయణ పాల్గొన్నారు.



కేతమ్మ ఆలయంలో తోట ఆగయ్య

సిద్దోగం వేడుకలు ప్రారంభం

కోనరావుపేట: మండలం సుద్దాలలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సిద్దోగం వేడుకలు ప్రారంభించారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గడ పావనితో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

మండలం పల్లిమక్త గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మకు బోనాలు తీశారు. బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు నైవేద్యంగా సమర్పించారు. గౌడ సంఘ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



పల్లిమక్తలో బోనాలు తీస్తున్న మహిళలు

ఘనంగా కొండమైసమ్మ పండుగ



కోనరావుపేట: మండల కేంద్రంలో కొండమైసమ్మ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోకల రేఖ, సింగిల్‌విండో డైరెక్టర్ గొట్టె మహేశ్వరి, ఉపసర్పంచ్ దండు శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఎర్రం మహేశ్, గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం పాల్గొన్నారు.